సాక్షి నిజామాబాద్

శుక్రవారం । 28 । జూన్ । 2024



క్యూరింగ్ మరిచారా?

ఎస్సారెస్పీ లక్ష్మి కాలువ ఆధునికీకరణ పనులు నాసిరకంగా చేపట్టారు. గైడ్‌వాల్‌కు క్యూరింగ్ చేయలేదు.

- 8లో ▸



సాయం కొందరికే..

మహాలక్ష్మి పథకానికి రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతో కొందరికే సాయం అందనుంది.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
39.6 /23.8

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. వాతావరణంలో తేమ అధికంగా ఉంటుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

పౌరసరఫరాల సంస్థ డీఎంగా రమేశ్



సుభాష్‌నగర్ : పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్‌గా వైపీ రమేశ్ (డిప్యూటీ కలెక్టర్) గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. రమేశ్ హైదరాబాద్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయం నుంచి బదిలీపై జిల్లాకు డీఎంగా వచ్చారు. గతంలో ఇక్కడ డీఎంగా విధులు నిర్వర్తించిన జగదీశ్‌కుమార్ గతనెల 30న సస్పెండ్ అయిన విషయం తెలిసిందే. ఆ తర్వాత మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేనేజర్ రాజేందర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆయన జూన్ 3న బాధ్యతలు స్వీకరించారు. 20 రోజుల్లోనే జిల్లాకు పూర్తిస్థాయి మేనేజర్‌గా రమేశ్‌ను నియమిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

వానల కోసం కప్పతల్లి ఆట



సిరికొండ : మండలంలోని గడ్కోల్ గ్రామంలో వర్షాలు కురవాలని గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గురువారం కప్పతల్లి ఆట ఆడారు. కర్రకు కప్పను కట్టి గ్రామంలో ఇంటింటికి తిరుగుతు గ్రామస్తులు కప్పతో పాటు కావడి మోస్తున్న వారిపై నీళ్ల పోశారు. కప్పను నీళ్లతో తడిపితే వర్షాలు కురుస్తాయని నమ్మకం. వేంకటేశ్వరస్వామి, నర్సింహస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి శనివారం అన్నదానం నిర్వహిస్తామని వీడీసీ సభ్యులు తెలిపారు. వీడీసీ చైర్మన్ రాములు, గంగారెడ్డి, భానుచందర్, నవీన్‌రెడ్డి, భాస్కర్, నవీన్, సురేందర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

30లోగా దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్‌అర్బన్ : డీఎడ్ ప్రవేశాలకు ఈ నెల 30లోగా దరఖాస్తు చేసుకోవాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈ నెల 29, 30 తేదీల్లో ఎడిట్ ఆప్షన్‌కు అవకాశం ఉంటుందన్నారు. జూలై 10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు.

స్పౌజ్ సర్టిఫికెట్ సమర్పించాలి

నిజామాబాద్ అర్బన్ : స్పౌజ్ కేటగిరిలో గత సెప్టెంబర్‌లో బదిలీ అయిన ఉపాధ్యాయులు ప్రస్తుతం ప్రమోషన్ పొందితే స్పౌజ్ సర్టిఫికెట్‌ను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం పని చేస్తున్న పాఠశాల నుంచి సర్టిఫికెట్ తీసుకొని ఈ నెల 28(శుక్రవారం)న కార్యాలయంలో అందించాలని సూచించారు. అలాగే ఎవరైనా స్పౌజ్ కేటగిరి తొలగించుకోవాలని అనుకుంటే డీఈవో కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నిజామాబాద్ మీదుగా ఢిల్లీకి వెళ్తున్న రైళ్లు

ఖలీల్ వాడి : కాజీపేట నుంచి సికింద్రాబాద్ మీదుగా న్యూఢిల్లీ వెళ్లాల్సిన రైళ్లను దారి మళ్లించి కాజీపేట నుంచి నిజామాబాద్ మీదుగా న్యూఢిల్లీ పంపిస్తున్నారు. గురువారం ప్రారంభమైన రైళ్ల మళ్లింపు ఈనెల 29 వరకు కొనసాగుతుందని నిజామాబాద్ రైల్వే సూపరింటెండెంట్ గంగరాజు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వేజోన్ పరిధిలోని కాజీపేట, సికింద్రాబాద్ మధ్య లైన్ పనులు జరుగుతున్నందున రైళ్లను దారి మళ్లింపు చేశారు.

జిల్లాలో 10.6 మి.మీ. వర్షపాతం

సుభాష్‌నగర్ : జిల్లాలో బుధవారం రాత్రి 10.6 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం కురిసింది. అత్యధికంగా భీమ్‌గల్‌లో 36.5 మిల్లీమీటర్లు, డిచ్‌పల్లిలో 33.0, పోతంగల్‌లో 31.8 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా ఈ సీజన్‌లో నాలుగు మండలాల్లో అత్యధిక వర్షపాతం నమోదు కాగా, 15 మండలాల్లో సాధారణం, 13 మండలాల్లో లోటు, ఒక మండలంలో అతి తక్కువ వర్షపాతం నమోదైంది. జిల్లాకు మరో మూడ్రోజులపాటు వర్షసూచన ఉందని, అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

మండలం	వర్షపాతం (మిల్లీ మీటర్లలో)	మండలం	వర్షపాతం
		కోటగిరి	27.6
		సిరికొండ	13.9
పోతంగల్	31.8	వేల్పూర్	12.5
ఇందల్వాయి	23.4	డిచ్‌పల్లి	33.0
ముప్కాల్	10.7	జక్రాన్‌పల్లి	20.3
భీమ్‌గల్	36.5	ధర్పల్లి	13.9
కమ్మర్‌పల్లి	26.0	ఆర్మూర్	9.4

పారదర్శకతకు పాతర



జిల్లాలో జరిగిన స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులలో భాగంగా సీనియారిటీ జాబితాలో రోస్టర్ ప్రక్రియకు మంగళం పాడారు. సీనియర్లకు రావలసిన పాఠశాలలను జూనియర్‌లకు కేటాయించారు. నాట్ విల్లింగ్ రాసిచ్చినప్పటికీ 13 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడం వివాదాస్పదంగా మారింది. గణితం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులలో పారదర్శకత లోపించింది.

- ఉపాధ్యాయుల పదోన్నతుల్లో మామూళ్ల పర్వం
- సీనియారిటీ జాబితాలో లోపించిన రోస్టర్ విధానం
- గణితం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం ప్రమోషన్లలో అవకతవకలు

నిజామాబాద్ అర్బన్ : ఉపాధ్యాయుల పదోన్నతుల్లో విద్యాశాఖ అధికారులు పారదర్శకతకు పాతర వేశారు. స్కూల్ అసిస్టెంట్ తత్సమాన కేడర్ పదోన్నతులకు సీనియారిటీ జాబితాలో రోస్టర్ ప్రక్రియకు మంగళం పాడారు. దీనివల్ల చాలామంది ఉపాధ్యాయులకు నష్టం జరిగింది. మల్టీ జోన్–1 పదోన్నతుల ప్రక్రియ మన జిల్లాలో ఆలస్యంగా జరగడంతో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గణితం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం విభాగాలలో పారదర్శకత లేకుండా పోయిందంటున్నారు.

స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులలో..

ఇటీవల నిర్వహించిన స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులలో అనేక అవకతవకలు వెలుగులోకి వచ్చాయి. గణితం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులలో పారదర్శకత లోపించింది. జూన్ 16న వెబ్ ఆప్షన్ ప్రారంభమై జూన్ 15న ముగిసింది. అన్ని జిల్లాల్లో జూన్ 18, 19 తేదీలలో పదోన్నతుల ఆర్డర్లు వచ్చాయి. మన జిల్లాలో మాత్రం జూన్ 20 రాత్రి 12 గంటల తర్వాత పదోన్నతుల ఆర్డర్లు వచ్చాయి. జూన్ 18, 19, 20న ఆర్డర్లు వచ్చినా అందులో చాలా తప్పులు ఉన్నాయని మార్పులు చేర్పులు చేసి డీఎస్సీకి పంపారు. మార్పులు చేయడంలో భాగంగా విద్యాశాఖ అధికారులు రోస్టర్‌ను తారుమారు చేసి సీనియర్లకు రావలసిన దగ్గర పాఠశాలలను జూనియర్‌లకు కేటాయించారు. ముడుపులకు ఆశపడి కొందరు అధికారులు ఒక ప్రధాన సంఘం సహకారంతో ఈ తతంగం నడిపినట్లు ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు.

ఈ తతంగంపై విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తే మరిన్ని నిజాలు బయటకు వచ్చే అవకాశం ఉంది. నిజామాబాద్ రూరల్ మండలంలోని కొండూరు పాఠశాలలో ఇద్దరికీ ఒకే చోట పోస్టింగ్ ఇచ్చారు. అలాగే నవీపేట లో పనిచేస్తున్న ఒక ప్రధాన సంఘం నాయకుడికి మరోచోట పోస్టింగ్ కల్పించారు. జక్రన్‌పల్లి మండలంలో ఓ ప్రధాన సంఘం నాయకుడికి అక్కడే పోస్టింగ్ ఇచ్చారు.

సీనియారిటీ తారుమారుతో ఉపాధ్యాయులకు నష్టం

జిల్లాలో ఇటీవల జరిగిన స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులలో భాగంగా జూన్ 16న వెబ్ ఆప్షన్లు ప్రారంభించారు. అంతకు ముందే ప్రతి కేటగిరీ వారీగా సీనియారిటీ జాబితా వెబ్ ఆప్షన్‌కు ఒక రోజు ముందుగా ప్రకటించారు. దానిలో ఏ నెంబర్ ప్రకారం ఏ పోస్టు ఎవరికి వస్తుంది స్పష్టంగా తెలియాలంటే రోస్టర్ విధానం ఉండాలి. అయితే రోస్టర్ లేకుండా సీనియారిటీ జాబితాలు తయారు చేశారు. దీనివల్ల క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరిగింది.

నాట్ విల్లింగ్ వారికి పదోన్నతులు..

జిల్లాలో జరిగిన పదోన్నతులలో భాగంగా ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం విభాగంలో 30 మంది ఉపాధ్యాయులు అంతకుముందు రెండుసార్లు పదోన్నతి తిరస్కరించినట్లు అధికారులు పేర్కొన్నారు. అయితే విద్యాశాఖ వద్ద లిస్ట్ లేకపోవడంతో అధికారులు ఉపాధ్యాయుల నుంచి ఇంతకు ముందు పదోన్నతులను తిరస్కరించలేదని డిక్లరేషన్ రాసిచ్చిన వారికి పదోన్నతులు కల్పించారు. డిక్లరేషన్ రాసిచ్చిన వారు ఒక వేళ గతంలో పదోన్నతులను తిరస్కరించినట్లు తేలితే వారి పదోన్నతిని రద్దు చేస్తారు. కాగా 13 మంది ఉపాధ్యాయులు డిక్లరేషన్ ఇవ్వనప్పటికీ అధికారులు పదోన్నతులు కల్పించడం వివాదాస్పదంగా మారింది. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్లు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఆరోపిస్తున్నారు. నవీపేట మండలానికి చెందిన ఓ ప్రధాన సంఘం నాయకుడు గతంలో పలు మార్లు పదోన్నతి తిరస్కరించినట్లు సమాచారం . అయినా ప్రస్తుతం పదోన్నతి పొందాడు.

డీఈవోను కలిసిన 'తపస్'

ఇటీవల జరిగిన పదోన్నతుల్లో అక్రమాలు జరిగాయని, వెంటనే విచారణ జరిపించాలని తపస్ నాయకులు గురువారం డీఈవో దుర్గప్రసాద్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. కొందరు సంఘం నాయకులు అర్ధరాత్రి వేళ కార్యాలయంలోకి వచ్చి జాబితా తారుమారు చేసినట్లు పేర్కొన్నారు. దీంతో ఎంతో మంది టీచర్లు మానసిక వేదన పొందుతున్నరని అన్నారు. పదోన్నతుల జాబితా విడదల కాకముందే బయటకు వచ్చిందని వారు ఆరోపించారు.



నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ గేట్లు

సాగర్ గేట్లకు స్టాప్‌లాక్

- లీకేజీలను అరికట్టేందుకు అధికారుల చర్యలు
- త్వరలో పనులు ప్రారంభం

నిజాంసాగర్ : నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ గేట్ల వద్ద లీకేజీని అరికట్టేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. జెన్‌కో గేట్ల తరహాలో స్టాప్‌లాక్ ఏర్పాటు చేయనున్నారు. 1970లో ప్రాజెక్ట్ ప్రధాన కాలువకు ఆయకట్టుకోసం ఐదు గేట్లు, విద్యుత్ ఉత్పత్తి కోసం ఐదు గేట్లు ఏర్పాటు చేశారు. ఆయకట్టు కింద పంటల సాగుతో పాటు పట్టణ ప్రాంతాల తాగునీటి అవసరాల కోసం ప్రాజెక్టు నుంచి ప్రధాన కాలువకు నీటిని విడుదల చేస్తున్నారు. అయితే జల విద్యుదుత్పత్తి దృష్ట్యా జెన్‌కో గేట్ల ద్వారా ప్రధాన కాలువకు నీటి విడుదలకు ప్రాధాన్యత ఇస్తారు. అయితే వర్షాకాలంలో వరద ప్రవాహానికి ప్రాజెక్టులోకి వ్యర్థ పదార్థాలతో పాటు కలప, ఇతరత్రా సామగ్రి కొట్టుకు వచ్చి ప్రధాన కాలువ గేట్ల వద్ద నిలుస్తుంది. దీంతో ప్రధాన కాలువకు నీటి విడుదల సమయంలో గేట్లు మొరాయిస్తున్నాయి. అంతేగాకుండా నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో సైడ్ రాడ్లు దెబ్బతింటున్నాయి. ఇరిగేషన్ విభాగంలోని ఐదు గేట్లలో ఒక గేటు పూర్తిగా బురదలో కూరుకుపోగా.. రెండు గేట్లు పైకి లేవడం లేదు. దీంతో ప్రస్తుతం రెండు గేట్ల ద్వారానే కాలువకు నీటిని వదులుతున్నారు. మరోవైపు ఈ గేట్ల ద్వారా నీరు లీకై వృథా అవుతోంది. దీంతో ప్రధాన కాలువ గేట్ల వద్ద స్టాప్‌లాక్ ఏర్పాటు కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించగా.. రూ.40 లక్షల నిధులు మంజూరయ్యాయి.

మరమ్మతులకు సన్నద్ధం

నిజాంసాగర్ ప్రధాన కాలువ ఇరిగేషన్ గేట్ల మరమ్మతులపై నీటి పారుదలశాఖ అధికారులు దృష్టి సారించారు. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టడంతో గేట్ల మరమ్మతులు, స్టాప్‌లాక్ పనులు చేపట్టనున్నారు. డ్యాం సేఫ్టీ అధికారుల సూచన మేరకు స్టాప్‌లాక్ గేట్ల ఏర్పాటుకు నిధులు రావడంతో పనులు చేసే యోచనలో ఉన్నారు. హెడ్ స్లూయిస్ వద్ద ప్రధాన కాలువ గేట్ల ప్రాంతంలో నీటి నిల్వలు తగ్గుముఖం పట్టగానే పనులు ప్రారంభించనున్నారు. ఏటా గేట్లు మొరాయిస్తుండడంతో లీకేజీల ద్వారా వందలాది క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. లీకేజీలను అరికట్టేందుకు ఏటా విశాఖపట్నం నుంచి గజ ఈతగాళ్లను రప్పించి లీకేజీలకు అడ్డుకట్ట వేస్తున్నారు. ప్రస్తుతం మరమ్మతులు పూర్తి చేస్తే లీకేజీ బాధలు తప్పనున్నాయి.

చెత్తతో ఎరువులు తయారు చేయాలి



ఎడపల్లిలోని మోడ్రన్ డంపింగ్ యార్డ్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ అంకిత్, డీఆర్‌డీవో సాయాగౌడ్

ఎడపల్లి : తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి కంపోస్టు ఎరువులు తయారు చేయాలని అదనపు కలెక్టర్ అంకిత్ సూచించారు. ఎడపల్లిలో రూర్బన్ పథకంలో నిర్మించిన మోడ్రన్ డంపింగ్ యార్డును గురువారం ఆయన పరిశీలించారు. యార్డు నిర్వహణకు ఎవరు ముందుకు రాకపోవడంతో గ్రామ సంఘం ఆధ్వర్యంలో దీనిని నిర్వహించాలని ఆదేశించారు. చెత్తను సేకరించి డంపింగ్ మిషన్‌లో వేసి ఎరువులను తయారీ చేయాలని మహిళా సమాఖ్య సభ్యులను ఆయన ఆదేశించారు. తయారు చేసిన కాంపోస్టు ఎరువును విక్రయించి ఉపాధి పొందాలని ఆయన సూచించారు. డీఆర్‌డీవో సాయాగౌడ్, ఎంపీడీవో శంకర్, ఏపీఎం సాయిలు తదితరులు పాల్గొన్నారు.

చరిత్రపై అవగాహన ఉండాలి

- ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రావు



నూతన కమిటీతో ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రావు, ప్రధాన కార్యదర్శి వీరేంద్ర

సుభాష్‌నగర్ : చరిత్రపై అధ్యయనం జరగకపోతే మన భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందని, భారతీయులు అనుభవించిన అన్ని కష్టాలకు కారణం చరిత్ర తెలుసుకోకపోవడం మాత్రమేనని ఇతిహాస సంకలన సమితి రాష్ట్ర అధ్యక్షుడు, ఓయూ విశ్రాంత రిజిస్ట్రార్ వి కిషన్‌రావు అన్నారు. ప్రతి వ్యక్తి తన కుటుంబం, గ్రామం, దేశ చరిత్రపై అవగాహన కలిగి ఉండాలని, అందుకోసమే ఇతిహాస సంకలన సమితి పని చేస్తుందని తెలిపారు. గురువారం నగరంలోని వంశీ హోటల్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇతిహాస సంకలన సమితి ఇందూరు జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కిషన్‌రావు మాట్లాడుతూ దేశ చరిత్రలో వక్రీకరణకు గురైన అనేక సత్యాలను భవిష్యత్ తరాలకు అందించాలని అఖిల భారతీయ సంస్థ ఇతిహాస సంకలన సమితి పని చేస్తుందన్నారు. సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేంద్ర మాట్లాడుతూ జిల్లా కమిటీ ఎన్నిక జరగటం ఎంతో ఆనందదాయకమన్నారు. జిల్లా నూతన అధ్యక్షుడు కలువకోట నరేష్ కుమార్ మాట్లాడుతూ శక్తి వంచన లేకుండా సంస్థ బలోపేతానికి, జిల్లాలో చరిత్ర అధ్యయనానికి అండగా ఉంటానని పేర్కొన్నారు. అనంతరం మూడు తీర్మానాలను సమావేశం ఆమోదించింది. కార్యక్రమంలో అనురాధ రాజహంస, కందకుర్తి యాదవరావు, ప్రొఫెసర్ చందుపట్ల ఆంజనేయులు, ఆర్ఎస్ఎస్ జిల్లా కార్యవాహ డాక్టర్ వారే దస్తగిరి, నిర్మల్ జిల్లా బాధ్యులు బలగం రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కమిటీ సభ్యులు వీరే..

ఇతిహాస సంకలన సమితి జిల్లా అధ్యక్షుడిగా కలువకోట నరేష్‌కుమార్, సంరక్షకులుగా కందకుర్తి యాదవరావు, తాటి వీరేశం, కార్యాధ్యక్షుడిగా చిలుముల మోహన్ దాస్, గౌరవ సలహాదారుడిగా ప్రొఫెసర్ చందుపట్ల ఆంజనేయులు, ఉపాధ్యక్షురాలిగా కుమారి శైలి బెల్లాల్, ప్రధానకార్యదర్శిగా కందకుర్తి ఆనంద్, కార్యదర్శిగా మర్రిపల్లి భూపతి, కోశాధికారిగా బుచ్చ సాయిరెడ్డి, మహిళా ప్రముఖ్‌గా దర్పస్తు రాధ, సంపర్క్ ప్రముఖ్‌గా మండలోజు నరసింహం, ఈసీ సభ్యులుగా వెంకట మల్లయ్య, గున్నాల నవీన్, నల్లూరి సురేష్, వితం దయానంద్, దంతోజి జయకృష్ణ, లక్‌పతివార్ నిఖిలేష్, ప్రవీణ్‌కుమార్ ఆర్య ఎన్నికయ్యారు.

మొక్కలతో పసుపు సాగు

- విత్తనాలకు బదులుగా పంపిణీ చేస్తున్న పసుపు పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు
- అందుబాటులో 1.50 లక్షల మొక్కలు



మోర్తాడ్ : పసుపు సాగులో వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు. పసుపు విత్తనానికి బదులు మొక్కలను పంపిణీ చేసి వాటి ద్వారా పంట సాగు చేయించడానికి రైతులకు ఇప్పటికే అవగాహన కల్పించారు. మూడేళ్ల నుంచి మొక్కలను పంపిణీ చేస్తున్నారు. రైతులకు విస్తృతమైన అవగాహన కల్పిస్తే విత్తనం ఆదాతో పాటు తక్కువ సమయంలో మొక్కలను నాటి దిగుబడి పెంచుకోవడానికి వీలు ఉంటుందని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు. గతంలో ఉచితంగానే పసుపు మొక్కలను పంపిణీ చేయగా ఈసారి మాత్రం ధర నిర్ణయించారు. ఒక మొక్కకు రూ.1 చొప్పున వసూలు చేయాలని ఉద్యానవన శాఖ నిర్ణయించింది. పసుపు పరిశోధన స్థానంలో ఈ సీజనుకు గాను 1.50లక్షల మొక్కలను పెంచి అందుబాటులో ఉంచారు.

అందుబాటులో వివిధ రకాలు

పసుపు పరిశోధన కేంద్రంలో వివిధ రకాల పసుపు మొక్కలు అందుబాటులో ఉన్నాయి. ఆర్మూర్ రకం , మహేంద్ర సోనాలిక, పీతాంబర్, రాజ్‌పురి, సేలెం రకాల మొక్కలు పెంచారు. ఒక ఎకరానికి 30 వేల మొక్కలు అవసరం ఉంటాయి. ప్రయోగాత్మకంగా మొక్కలతో పసుపు సేద్యం ఆరంభించడంతో ఒక్కో రైతుకు 2వేల మొక్కల నుంచి 5వేల మొక్కల వరకు అందించాలని నిర్ణయించారు. గతంలో ప్రతి సీజనులో రెండు లక్షల చొప్పున మొక్కలను పంపిణీ చేశారు. గత సంవత్సరం ఉచితంగా ఇవ్వడానికి బదులు రైతులకు కొంత చార్జీ వేయాలని ఉద్యానవన శాఖ నిర్ణయించింది. ఒక్కో మొక్క పెంపకానికి ఉద్యానవన శాఖ రూ.1.25 వరకు ఖర్చు చేయగా రైతుల నుంచి ఒక్క రూపాయి మాత్రమే వసూలు చేస్తున్నారు. కాగా పలువురు రైతులు ఇప్పటికే పసుపు విత్తనం పూర్తి చేశారు. మొక్కలతో సేద్యం చేయడానికి ఇంకా సమయం ఉందని ఉద్యానవన శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కల సాగుతో మంచి ఫలితాలు వస్తున్నాయని ఇంకా మెరుగైన ఫలితాల కోసం పరిశోధన సాగుతుందని అధికారులు వెల్లడించారు.

సాగు బాగుంటుంది



మొక్కలతో పసుపు సాగు బాగుంటుంది. గతంలో ఒకటి రెండు రకాల మొక్కలనే పంపిణీ చేశాం. ఈసారి ఐదు రకాల మొక్కలను అందుబాటులోకి తీసుకు వచ్చాం. రైతుల నుంచి నామమాత్రపు చార్జీలనే వసూలు చేసి మొక్కలను అందిస్తున్నాం.

– మహేందర్, శాస్త్రవేత్త, పసుపు పరిశోధన స్థానం

ఉత్సాహంగా స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు



నిజామాబాద్‌నాగారం: స్పోర్ట్స్ స్కూల్‌కు ఎంపికలను నగరంలోని రాజారాం స్టేడియంలో గురువారం నిర్వహించారు. జిల్లా యువజన క్రీడల అధికారి ముత్తెన్న ఆధ్వర్యంలో నాల్గో తరగతిలో ప్రవేశానికి ఎంపిక పోటీలు కొనసాగాయి. బాలురు 16మంది, బాలికలు 9మంది హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన బాలబాలికలను జూలై 8 నుంచి 12వరకు నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీలకు పంపిచనున్నట్లు అధికారులు తెలిపారు. పీడీ, పీఈటీలు పాల్గొన్నారు.



స్పోర్ట్స్ స్కూల్ ఎంపిక పోటీల్లో లాంగ్ జంప్ చేస్తున్న చిన్నారి

క్లుప్తంగా

గురుకులాల్లోని ఖాళీ సీట్లలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్‌): తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరానికి 5నుంచి 9వ తరగతి వరకు మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవాలని సంస్థ నిజామాబాద్ ప్రాంతీయ సమన్వయ అధికారిణి (ఆర్‌సీవో) కే అలివేలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 ఫీజు చెల్లించి http:// tgswadtr. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 27నుంచి జూలై 12వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

బదిలీల కోసం..

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరం 5 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు పాఠశాల బదిలీ కోసం ఆన్‌లైన్‌లో దర ఖాస్తు చేసుకోవాలని సంస్థ నిజామాబాద్ ప్రాంతీయ సమన్వయ అధికారిణి (ఆర్‌సీవో) కే అలివేలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 ఫీజు చెల్లించి http:// tgswadtr. cgg. gov. in వెబ్‌సైట్ ద్వారా ఈనెల 27 నుంచి జూలై 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

ఎస్సారెస్పీలోకి స్వల్ప ఇన్‌ఫ్లో

బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండడంతో శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌లోకి స్వల్పంగా ఇన్‌ఫ్లో వస్తోంది. ఎగువ నుంచి 2894 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండడంతో ప్రాజెక్ట్ నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ప్రాజెక్ట్ నుంచి మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 202 క్యూసెక్కులు పోతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80 టీఎంసీలు) అడుగులు కాగా గురువారం సాయంత్రానికి 1058.60(9.33 టీఎంసీలు) అడుగుల మేర నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

రేపు జాబ్ మేళా

నిజామాబాద్ నాగారం: జిల్లాలోని నిరుద్యోగులకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాల కల్పన కోసం ఈ నెల 29న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి సిరిమల్ల శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌ఆర్ హెచ్ కంపెనీలో టెలీకాలర్ ఉద్యోగాలకు నియామకాలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ ఉత్తీర్ణులై, తెలుగు, హిందీ, ఇంగ్లిష్ మాట్లాడగలిగే పురుషులు అర్హులని, ఆసక్తి గల అభ్యర్థులు శివాజీనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో శనివారం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5గంటలలోగా మేళాకు హాజరు కావాలని సూచించారు. అభ్యర్థులు తమ బయోడేటాతోపాటు ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, ఫొటో వెంట తీసుకురావాలని, ఇతర వివరాలకు 95817 68413, 99487 48428, 63057 43423, 99594 56793 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.

ఆహారమే ఔషధం..



తెయూ(డిచ్‌పల్లి): ఆహారంతోనే ఆరోగ్యం కాపాడుకోవచ్చని, ఆహారమే ఔషధంగా మార్చుకోవాలని మాతాజీ నిర్మలాదేవీ సహజ యోగా కేంద్రానికి చెందిన యోగా గురువు కరణ్ పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ కె రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ సెమినార్ హాల్‌లో గురువారం సహజ యోగా మెడిటేషన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి యోగా గురువు కరణ్ హాజరై యోగా వల్ల కలిగే ప్రయోజనాలు, పాటించాల్సిన విధానాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ ఆరతి, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సాయం కొందరికే..!

- 'ఆసరా' ఉన్న కుటుంబానికి రూ.2500 సాయం లేనట్టే?
- జిల్లాలో 3,55,347 'మహాలక్ష్మి' దరఖాస్తులు
- రేషన్‌కార్డు ప్రామాణికంగా లబ్ధిదారుల ఎంపిక



మోర్తాడ్(బాల్కొండ): మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2,500 చొప్పున సాయం అందించాలని ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ.. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను పరిశీలిస్తే సాయం కొంత మందికే పరిమితమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. జిల్లాలో మహాలక్ష్మి పథకానికి 3,55,347 మంది దరఖాస్తు చేసుకోగా, లబ్ధిదారుల ఎంపికకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నారు. అలాగే, ఇంట్లో ఎవరైనా ఆసరా పింఛన్ పొందుతుంటే వారికి నెలవారి సాయం అందే అవకాశం లేదు. ఇప్పటికే జిల్లాలో 77,158 మంది వితంతు, 10,520 మంది ఒంటరి మహిళ, 96,264 మంది బీడీ పింఛన్(జీవన భృతి) అందుకుంటున్నారు. వికలాంగ, వృద్ధాప్య పింఛన్లు అందుకుంటున్న వారిలోనూ మహిళలు ఉన్నారు. మెజార్టీ కుటుంబాలకు ఆసరా పథకం కింద ఏదో ఒక పింఛన్ అందుతోంది. ఇదిలా ఉండగా, ఆసరా పథకం కింద లబ్ధిపొందే కుటుంబాల్లోని మహిళలకు మహాలక్ష్మి సాయం అందించబోమని ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల్లో స్పష్టంగా ఉంది. ఈ లెక్కన సాయం అందుకోవడానికి అర్హత సాధించే మహిళల సంఖ్య భారీ సంఖ్యలో తగ్గిపోనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆరు గ్యారెంటీల కోసం ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులను కేటాయించింది. మహాలక్ష్మి సాయం కోసం వచ్చిన దరఖాస్తులను ఇప్పటికే ఆన్‌లైన్ చేయగా ఆధార్‌కార్డుల అనుసంధానం, ఆసరా లబ్ధిదారుల ఇంటి నుంచి సాయం కోసం వచ్చిన దరఖాస్తులను జల్లడ పడితే అసలైన లబ్ధిదారులు ఎవరనేది తేలనుంది. ఏది ఏమైనా మహాలక్ష్మి సాయం కోసం నిరీక్షిస్తున్న వారికి ఇంకా కొంత సమయం పట్టడంతోపాటు ఎక్కువ కుటుంబాల వారికి లబ్ధి చేకూరకపోవచ్చు.

మార్గదర్శకాలను సవరిస్తేనే..

మహాలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందించే విషయంలో ప్రభుత్వం గతంలోనే మార్గదర్శకాల ను జారీ చేసింది. గతంలో ఇచ్చిన వాటిని సవరిస్తే నే అర్హుల సంఖ్య పెరగొచ్చు.రేషన్‌కార్డు లేని కుటుంబాలకు మాత్రం సాయం అందే అవకాశం లేదు.

– తిరుమల, ఎంపీడీవో, మోర్తాడ్

క్యూరింగ్ మరిచారా?

- లక్ష్మికాలువ ఆధునికీకరణ పనుల్లో నిర్లక్ష్యం



క్యూరింగ్‌చేపట్టని గైడ్‌వాల్

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి నీటిని సరఫరా చేసే లక్ష్మికాలువ ఆధునికీకరణ పనుల్లో వాటర్ క్యూరింగ్‌ను విస్మరించడంతో పూర్తయిన నిర్మాణ పనులు మూన్నాళ్లకే ముక్కలవుతున్నాయి. రూ.20 కోట్ల నిధులతో లక్ష్మికాలువ ఆధునికీకరణ పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కాలువల లైనింగ్, అవసరమైన చోట వంతెనలు, గైడ్‌వాల్స్ నిర్మిస్తున్నారు. వేంపల్లి ఎత్తిపోతల పథకం నీటి సరఫరా కోసం వేంపల్లి శివారులోని పాత నిజాంసాగర్ కాలువకు గైడ్ వాల్ పనులు చేపట్టి క్యూరింగ్ చేయడం మరిచారు. ప్రాజెక్ట్ కాలువల పనులు అంటేనే అధికారులు ఒకింత నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తారనే విమర్శలున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి క్యూరింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

నాణ్యత అంతంత మాత్రమే..

కాలువ ఆధునికీకరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు సైతం అంతంత మాత్రంగానే ఉన్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మట్టితో కలిసిన ఇసుకను తక్కువ ధరకు కొనగోలు చేయడంతోపాటు రాక్‌సాండ్‌ను కలిపి పనుల్లో వినియోగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. కొన్ని చోట్ల కాలువలో పేరుకు పోయిన ఇసుకను తీసి పనుల్లో వినియోగిస్తున్నారు.

బాకీ డబ్బులు అడిగినందుకు దాడి



బొల్లారం గ్రామస్తులను విచారిస్తున్న పోలీసులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బాకీడబ్బులు అడిగినందుకు బూతులు తిట్టడంతోపాటు దాడి చేశారని, ఇంటిని ధ్వంసం చేశారని మండలంలోని బొల్లారం గ్రామానికి చెందిన గొల్ల పండరి పోలీసులకు పిర్యాదు చేశాడు. ఎస్సై రాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. పండరి గురువారం అదే గ్రామానికి చెందిన ఇగురం రాజుగౌడ్‌కు వద్దకు వెళ్లి తనకు ఇవ్వాల్సిన రూ.25వేలు అడుగగా, ఇంటికి వచ్చి డబ్బులు అడుగుతావా.. అంటూ పండిరిని రాజుగౌడ్ బూతులు తిట్టాడు. ఆ తరువాత రాజుగౌడ్‌తోపాటు అతడి అన్న యాదగిరిగౌడ్ కలిసి పండరిపై దాడి చేశారు. అనంతరం పండరి ఇంటికి వెళ్లి అతడి భార్య, వదినపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు యాదగిరిగౌడ్, రాజుగౌడ్, లింగంపేటకు చెందిన పోతగోని రవిగౌడ్, బబ్లూ, అరవింద్, రాజేశ్వర్‌గౌడ్‌తోపాటు మరికొంతమందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. దాడిఘటనపై పోలీసులు గ్రామంలో విచారణ చేపట్టారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌అర్బన్: గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పలు సబ్జెక్టుల్లో బోధించేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రామ్మోహన్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంగ్లిష్, తెలుగు, పొలిటికల్ సైన్స్, బిజినెస్ అనాలసిస్ట్, టాక్సేషన్, బీబీఏ, బీసీఏ, లాజిస్టిక్స్ కంప్యూటర్ సైన్స్, అప్లికేషన్స్, డేటా సైన్స్, స్టాటిస్టిక్స్, బయోటెక్నాలజీ సబ్జెక్టుల్లో బోధించేందుకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు వెల్లడించారు. నెట్ సెట్, పీహెచ్‌డీ బోధనా అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. దరఖాస్తులను జూలై 2 వరకు కళాశాలలో అందించాలని, జూలై 4న ఇంటర్వ్యూ, డెమో ఉంటుందని పేర్కొన్నారు.

150 కేజీల ప్లాస్టిక్ బ్యాగులు సీజ్



ఆర్మూర్‌టౌన్: ప్లాస్టిక్ నివారణలో భాగంగా మున్సిపల్ అధికారులు చేపడుతున్న తనిఖీల్లో 150 కేజీల ప్లాస్టిక్ బ్యాగులను సీజ్ చేశారు. పెర్కిట్ ఏరియాలోని రాందేవ్ ప్లాస్టిక్ దుకాణాలతో పాటు ఇతర దుకాణాల్లో పర్యావరణ ఇంజినీర్ పూర్ణమౌళి తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో సుమారు 150 కేజీల ప్లాస్టిక్‌ను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. ఎవరూ ప్లాస్టిక్ వినియోగించవద్దని, జ్యూట్ బ్యాగులను వాడాలని సూచించారు. తనిఖీల్లో సానిటరీ జవాన్ రాజన్న, సిబ్బంది అక్షయ్, రవి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

సిరికొండ ఎస్సైపై సీపీకి ఫిర్యాదు

ఖలీల్‌వాడి: తనను కొట్టి జైలుకు పంపిస్తానని బెదిరించాడని ఆరోపిస్తూ సిరికొండ ఎస్సై రమేశ్‌పై సీపీ కల్మేశ్వర్‌కు తాళ్లరామడుగు గ్రామానికి చెందిన సాయిరి కృష్ణ గురువారం ఫిర్యాదు చేశాడు. భూమి పంపకం విషయంలో తన సోదరుడితో వివాదం నెలకొనగా కుల సంఘం పెద్దమనుషులు ఒప్పందం కుదిర్చారని, అయినప్పటికీ వారి మాట వినకుండా సోదరుడు తనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడన్నారు. అయితే, తనను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించిన ఎస్సై విచారణ చేపట్టకుండానే కొట్టాడని, బుధవారం సాయంత్రం రాత్రి 10.30గంటల వరకు స్టేషన్‌లో ఉంచాడని ఆవేదన వ్యక్తం చేశాడు. ఉమ్మడి వ్యవసాయ భూమి విషయాన్ని సంఘ సభ్యులు సమక్షంలో మాట్లాడుకున్నామని చెప్పినా వినకుండా ఎస్సై బూతులు తిట్టాడని ఫిర్యాదులో పేర్కొన్నాడు. స్పందించిన సీపీ వెంటనే సీఐకి ఫోన్ చేసి విచారణ చేపట్టాలని ఆదేశించారు.

30 వాహనాలు స్వాధీనం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్ వద్ద పోలీసులు గురువారం వాహనాల తనిఖీ చేపట్టారు. డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై మహేశ్, ఎంవీఐలు రాహుల్‌కుమార్, కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో వాహనాలను తనిఖీ చేసి ధ్రువపత్రాలు, నంబరు ప్లేట్లు లేని 30 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ పేర్కొన్నారు. వాహనదారులు సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్ ఉండేలా చూసుకోవాలని లేదంటే చట్టప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇరిగేషన్ సూపరింటెండెంట్‌గా 'గైని'



ఇరిగేషన్ సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న గైని గంగారాం

నిజామాబాద్‌నాగారం:నీటిపారుదల శాఖ నిజామాబాద్ సర్కిల్ ఎస్ఈ కార్యాలయ సూపరింటెండెంట్‌గా గైని గంగారాం గురువారం బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు డీఈఈ భీమ్యానాయక్‌ను కలిసి జాయినింగ్ లెటర్ అందించారు. ఇరిగేషన్, డీఎంహెచ్‌వో, ఎక్సైజ్, జెడ్పీ, హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్, ఎస్ఆర్ఎస్పీ సర్కిల్, బీసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు విజయ్, తెలంగాణ ఎమ్మార్పీఎస్ సంఘాల రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాంపల్లి, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కెంపుల నాగరాజు, క్రిస్టియన్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వైఆర్ డేవిడ్, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రామ్మోహన్‌రావు, జిల్లా నాయకుడు శంకర్, బీసీ సంఘం నాయకులు శంకర్ గైని గంగారాంను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో రాజకీయ జేఏసీ జిల్లా కన్వీనర్‌గా, టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడిగా గంగారాం ఎన్నో సేవలందించారని పేర్కొన్నారు. ప్రస్తుతం టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా సేవలందిస్తున్న గైని గంగారాం రానున్న రోజుల్లో మరింతగా ఎదగాలని, మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు.

భార్యతో గొడవపడి ఆత్మహత్య

మాచారెడ్డి: భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ఘన్‌పూర్‌లో గురువారం చోటుచేసుకుంది. మాచారెడ్డి ఏఎస్సై రామేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఘన్‌పూర్‌కు చెందిన సాడెం నర్సింలు(50) బుధవారం రాత్రి భార్యతో గొడవపడ్డాడు. దీంతో మనస్తాపానికి గురైన నర్సింలు గురువారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ శివారులోని శ్మశాన వాటిక వద్ద చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

కడుపునొప్పి భరించలేక వివాహిత..



గౌతమి (ఫైల్)

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్‌కు చెందిన మార్గం గౌతమి(25) కడుపు నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. గత మూడు రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్న గౌతమి.. గురువారం ఉదయం భర్త రాజు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మెట్‌పల్లి మండలంలోని రామ్‌లక్ష్మెట్టిపేట్‌కు చెందిన గౌతమి కిరాజుతో ఐదేళ్ల క్రితం పెళ్లయ్యింది. ఉపాధి నిమిత్తం దుబాయికి వెళ్లిన ఆమె భర్త రాజు నెల రోజుల క్రితం తిరిగివచ్చాడు. మృతురాలికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. ఘటనా స్థలాన్ని డిచ్‌పల్లి సీఐ మల్లేశ్, ఎస్సై తిరుపతి, తహసీల్దార్ కిరణ్మయి పరిశీలించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో..



రోదిస్తున్న కుటుంబసభ్యులు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యం కారణంగా మండలంలోని బంజరా తండాకు చెందిన దరావత్ శంకర్(50) గురువారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న శంకర్‌కు ఆర్థిక ఇబ్బందులు సైతం ఎక్కువయ్యాయి. దీంతో చికిత్స కోసం ఆస్పత్రికి వెళ్లలేకపోయాడు. మనస్తాపానికి గురైన శంకర్ జీవితంపై విరక్తిచెంది తన నివాసపు గుడిసెలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని భార్య సంత్యాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

మంజీరానదిలో దూకి మహిళ..



సుగుణ మృతదేహం

పిట్లం(జుక్కల్): మండలంలోని బొల్లక్‌పల్లి సమీపంలో మంజీరనదిలో దూకి కారేగాం గ్రామానికి చెందిన చెందిన సుగుణ(36) ఆత్మహత్య చేసుకుంది. గురువారం రాత్రి సుగుణ నదిలో దూకడంతో అటువైపుగా వెళ్తున్న వారు గమనించి డయల్ 100కు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతురాలి భర్త ఏడాది క్రితం మృతి చెందగా, కు మారుడు, కూతురు ఉన్నారు. సుగుణ ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని పోలీసులు పేర్కొన్నారు.

క్రైం కార్నర్

విదేశాల్లో ఇద్దరు జిల్లా వాసులు మృతి

పొట్టచేత పట్టుకొని విదేశాలకు వెళ్లిన ఇద్దరు జిల్లావాసులు అక్కడ జరిగిన ప్రమాదాల్లో మృతి చెందారు. బహ్రెయిన్ మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇందల్వాయి మండలం కేకే తండావాసి రాజుపైకి చెత్త ట్రక్కు ఎక్కడంతో అతడు మృతి చెందగా, మస్కట్‌లో రోడ్డు దాటుతున్న ధర్పల్లికి చెందిన రాము.. వెనుక నుంచి వాహనం ఢీకొట్టడంతో మృతి చెందాడు. ఎన్నో ఆశలతో గల్ఫ్‌దేశాలకు వెళ్లిన వారు అక్కడే విగతజీవులుగా మారడం ఆయా గ్రామాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

బహ్రెయిన్‌లో చెత్త ట్రక్కు పైకి ఎక్కిన ఘటనలో కేకే తండావాసి..



బాదవత్ రాజు (ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని కేకే తండాకు చెందిన బదావత్ రాజు గురువారం ఉదయం బహ్రెయిన్‌లో జరిగిన ప్రమాదంలో మృతి చెందినట్లు తండావాసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉపాధినిమిత్తం గత కొద్ది రోజుల క్రితం బహ్రెయిన్‌కు వెళ్లిన రాజు అక్కడి మున్సిపాలిటీలో పని చేస్తున్నాడు. అక్కడి డంపింగ్ యార్డులో చెత్త ట్రక్కు ప్రమాదవశాత్తు రాజు పైకి ఎక్కడంతో అక్కడికక్కడే మృతి చెందాడని కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మృతుడికి భార్యతోపాటు ఆరేళ్లలోపు ఇద్దరు పిల్లలు ఉన్నారని తండావాసులు తెలిపారు. రాజు మృతదేహాన్ని త్వరగా స్వదేశానికి తెప్పించేందుకు ప్రభుత్వం కృషి చేయాలని తండావాసులు కోరుతున్నారు.

మస్కట్‌లో రోడ్డు దాటుతూ ధర్పల్లి వాసి..



రాము (ఫైల్)

ధర్పల్లి: మండల కేంద్రానికి చెందిన పెర్కిట్ రాము మస్కట్‌లో బుధవా రం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పెర్కిట్ రాము (42) ఉపాధి నిమిత్తం మూడు నెలల క్రితం మస్కట్‌కి వెళ్లాడు. బుధవారం రోడ్డు దాటుతుండగా వెనుక నుంచి వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి రప్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు బాధిత కుటుంబ సభ్యులు తెలిపారు.

బోధన్ పట్టణంలో చోరీ

- 12 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.40వేల నగదు అపహరణ



వివరాలు తెలుసుకుంటున్న ఏసీపీ శ్రీనివాస్, సీఐ వీరయ్య

బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని ఆచన్‌పల్లి కాలనీలో తాళం వేసిన ఇంట్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. 12 తులాల బంగారం, 30 తులాల వెండి, రూ.40 వేల నగదును ఎత్తుకెళ్లారు. పట్టణ సీఐ వీరయ్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ఆచన్‌పల్లి కాలనీలోని పెడగాపల్లి రోడ్డులో నివాసం ఉంటున్న నాగలక్ష్మి గత నెల మే 23వ తేదీన ఇంటికి తాళం వేసి హైదరాబాద్‌లో ఉంటున్న కొడుకు నాగచంద్రారెడ్డి ఇంటికి వెళ్లింది. గురువారం తెల్లవారుజామున ఆచన్‌పల్లికి వచ్చిన నాగలక్ష్మి ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని చూసి ఆందోళనకు గురైంది. ఇంట్లోకి వెళ్లమూడగా బీరువాలోని బంగారం, వెండి, నగదు కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం అందించింది. ఏసీపీ శ్రీనివాస్ ఘటనాస్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు. క్లూస్ టీంను రప్పించి ఆధారాలు సేకరించారు. సీసీ పుటేజీని పరిశీలించగా ముఖానికి మాస్కులు ధరించిన ముగ్గురు వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తేలింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తుచేస్తున్నామని సీఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల గుండెపోటుతో ఇద్దరి మృతి

హస్నాపూర్‌కు చెందిన వ్యక్తి..



ముజీబ్ (ఫైల్)

పిట్లం(జుక్కల్): మండలంలోని హస్నాపూర్ గ్రామానికి చెందిన ముజీబ్ (34) అనే వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. ముజీబ్ బుధవారం ఛాతి నొప్పి వస్తోందని కుటుంబ సభ్యులకు తెలుపగా చికిత్స నిమిత్తం నిజామాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి ముజీబ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు. ముజీబ్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కలిగోట్‌లో గొర్రెల కాపరి..



గంగమల్లు మృతదేహం

జక్రాన్‌పల్లి: మండలంలోని కలిగోట్ గ్రామానికి చెందిన గొర్రెల కాపరి ముక్కెర గంగమల్లు (50) గుండెపోటుతో మృతి చెందినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. గురువారం ఉదయం గొర్రెలను మేతకు తీసుకెళ్లిన గంగమల్లు గ్రామ శివారులోని కాకరకాయల సంతోష్ పొలంలో మృతి చెందాడన్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపలవేటకు వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు..



రఘుపతి శ్రీనివాస్ మృతదేహం

ఎడపల్లి: మండలంలోని అంబం (వై)కి చెందిన రఘుపతి శ్రీనివాస్ (35) ఊర చెరువులో చేపలుపట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. చేపలను వేటాడేందుకు వేసిన వల శ్రీనివాస్ కాళ్లకు చుట్టుకోవడంతో అతడు నీటిలో మునిగిపోయాడు. స్థానిక మత్స్యకారులు కాపాడేప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్‌రెడ్డి తెలిపారు.

రైలులో నుంచి పడి గుర్తుతెలియని వ్యక్తి..

ఖలీల్‌వాడి/నవీపేట: రైలులో నుంచి ప్రమాదవశాత్తు జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. నిజామాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని మిట్టాపూర్ గ్రామ శివారులోని పొదల్లో మృతదేహం పడి ఉందని, మృతుడి వయస్సు సుమారు 55 ఏళ్లు ఉంటుందని, తెలుపురంగు షర్ట్, ధోతి ఉన్నట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 87126 58591 నంబర్‌ను సంప్రదించాలని రైల్వే ఎస్సై సాయిరెడ్డి కోరారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్టు ఎస్సై అప్పారావు గురువారం తెలిపారు. కాలనీలోని వాటర్ ట్యాంక్ సమీపంలో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని, పట్టుబడిన వారి నుంచి రూ.7910 నగదు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఎక్కడైన పేకాటస్థావరాలు కొనసాగితే తమకు సమాచారం అందించాలని కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

కొత్తపల్లి శివారులో..

మాక్లూర్: మండలంలోని కొత్తపల్లి శివారులోని రహస్య ప్రాంతంలో పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం దాడి చేసి ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విష్ణుమూర్తి, సీఐ అంజయ్య, స్థానిక ఎస్సై సుధీర్‌రావు సిబ్బందితో కలిసి పేకాటస్థావరంపై దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.10,350 నగదును స్వాధీనం చేసుకున్నారు. సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు పేకాట స్థావరంపై దాడి చేశామని, పట్టుబడిన వారిని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని ఏసీపీ విష్ణుమూర్తి తెలిపారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మూడోటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో కొనసాగుతున్న వ్యభిచార గృహంపై పోలీసులు గురువారం దాడి చేశారు. సుభాష్‌నగర్‌లోని ప్రముఖ ఆలయం వెనుక ప్రాంతంలోని ఇంట్లో వ్యభిచారంసాగుతోందని డయల్ 100కు ఫిర్యాదు అందడంతో దాడి చేసిన పోలీసులు.. నిర్వాహకురాలితోపాటు అక్కడికి వెళ్లిన ఓ బహుజన నాయకుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. కార్మిక నాయకుడిగా చలామణి అవుతున్న సదరు వ్యక్తి పోలీసులకు పట్టుబడడం చర్చనీయాంశమైంది.

పోక్సో కేసు నమోదు

బోధన్‌రూరల్: మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్లు బోధన్ రూరల్ ఎస్సై నాగనాథ్ గురువారం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

హనీట్రాప్ చేసిన వ్యక్తి అరెస్ట్

ఖలీల్‌వాడి: హనీట్రాప్ చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబర్ క్రైం ఏసీపీ వై వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. వరంగల్‌కు చెందిన ఓ ప్రైవేట్ ఉద్యోగి తన గొంతును స్త్రీ గొంతుగా మార్చి నిజామాబాద్ నగరానికి చెందిన వ్యక్తిని ట్రాప్ చేశాడు. మాయమాటలు చెప్పి డబ్బు కాజేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితుడిని అరెస్ట్ చేసి జిల్లా కోర్టులో హాజరుపరిచారు. జిల్లా ప్రజలు సైబర్ మోసగాళ్లబారిన పడితే వెంటనే 1930 నంబర్‌కి ఫిర్యాదు చేయాలని ఏసీపీ సూచించారు.

మహిళ అదృశ్యం

ఖలీల్‌వాడి: నగరంలోని ఆర్యనగర్‌కు చెందిన శ్రేయ అనే మహిళ అదృశ్యమైనట్లు నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పోలీసులు తెలిపారు. మానసికస్థితి సరిగా లేని శ్రేయ ఈనెల 15వ తేదీన ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని, సదరు మహిళ ఆచూకీ తెలిసిన వారు ఎస్‌హెచ్‌వో (87126 59840), సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (97126 59836), పోలీస్‌స్టేషన్ (87126 59719)కు సమాచారం అందించాలని కోరారు.